# జ్ఞానోదయం

వెంకటయ్య ముఖం వాడిన పూవులా వెలవెలా బోతూంది. ప్రాణం విలవిల్లాడుతూంది. మిట్ట మధ్యాహ్నం, కోపగొండి అప్పులవాడిలా సూర్యుడు నెత్తిమీదున్నాడు. చెరువు కట్టమీద అడుగులు భారంగా పడుతున్నై. చెమట భుజాలమీంచి కారిపోతూంది.

"ఇది ఐదో అబ్దికం గదా, అతిథి అభ్యాగతులు కడుపారా భోంచేస్తే మీ నాన్నగారికెంతో తృప్తి..."

ఉదయం నాన్నగారి ఫోటోకు మొక్కుతూ అమ్మ అనసూయమ్మ అన్నప్పట్నుంచీ అనిపిస్తూంది - సాధుసంతులెవరన్నా ఈ రోజు ఇంట్లో భోంచేస్తే బావుండేదని.

చెల్లి, బావ నిన్ననే దిగారు. బంధు మిత్రులు - పిండపూజ జరిగేప్పుడు చుట్టూ కూచున్నారు. పూజానంతరం పిండాలను పవిత్ర గంగలో కలపాలి. గంగానది గానీ, అలాంటి మరో నది గానీ ఆ ప్రాంతంలో లేదు కాబట్టి వాటిని ఊరి చెరువు నీళ్ళల్లో కలిపి తిరిగి వస్తూంటే నిప్పుల మీద నడుస్తున్నట్టుంది.

చెరువు గట్టునే బస్టాండుంది.

తాతల మూతులు తాగిన నేతుల వాసన మనవల మీసాల మీద మిగిలున్నట్టు - డబడబలాడే డబ్బా రేకుల బస్సు కోసం ఎదురు చూసే ప్రయాణీకుల కోసం నైజాం ప్రభుత్వం కట్టించిన విశ్రాంతి గృహం అవశేషాలు మిగిలున్నాయక్కడ.

నైజాం సర్కారుతోపాటు డబ్బా రేకుల బస్సు రాక గూడా మాయమైంది. ఆ తర్వాత పాతికేళ్ళకు - ఇంటికో కరెంటు దీపం, ఊరికో ఆర్టీసీ బస్సు పథకము అమలులో భాగంగా ఆ ఊళ్లో ఆర్టీసీ బస్సు ప్రత్యక్షమైంది. ఇప్పుడైతే రోజుకు నాలుగైదు బస్సులు నడుస్తున్నై.

చేతి గడియారం రెండు చూపిస్తుంది.

ఒంటి గంటకు రావాల్సిన బస్సు తెగబలిసిన ఆంబోతులా దుమ్ములో కుమ్ముకొచ్చింది. కాకి రెట్ట వేసినట్టు ఒకే ఒక వ్యక్తిని దింపేసి తనదారిన తాను వెళ్ళింది. అయితే ఏం ? అదృష్టవశాతు ఆ దిగిన మనిషో సన్యాసి.

ఆహా ! ఆడబోయిన తీర్థ మెదురైంది. నా కోరిక మన్నించి ఆ దేవుడే పంపించాడు. మండుటెండ వెంకటయ్య పాలిట పండు వెన్నెలైంది. వెలవెల మొహం కళకళలాడింది. ఆఫీసరు అర్జంట్ పిలుపందుకున్న బంట్రోతులా వడివడిగా వెళ్ళి చెట్టుకింద సేద దీర్చుకుంటున్న సన్యాసి పాదాలంటి సంబరపడిపోయాడు.

"స్వామీ ! ఈ రోజు మా నాన్నగారి అబ్దికం. ఆయన మహాజ్ఞాని. చేసింది అటెండరు ఉద్యోగమైనా పురాణాలను పుక్కిట పట్టేశాడు. గురువును గుంజి గుంజి, లఘువును లాగి లాగి అన్నట్టుగా కాకుండా అసిధారావ్రతంగా చక్కని చిక్కని కవిత్వం చెప్పేవాడు. మీరు మా ఇల్లు పావనం చేసి, భిక్ష స్వీకరించి మమ్మల్ని కృతార్థుల్ని చెయ్యాలి. సవినయంగా చేతులు కట్టుకు నుంచున్నాడు. జవాబు కోసం నిరీక్షిస్తూ.

కాషాయ వస్త్రాల్లో నిండైన విగ్రహం, చేతుల్లో దండ కమండలాలు. తెలుపు నలుపు కలగలిపిన పొడుగాటి గెడ్డం. అందుకు తగిన మీసాలు... తెరిస్తే తప్ప నోరెక్కడుందో అర్థం కాని పరిస్థితి. ఉదయాకాశాన బాలభానునిలా - విశాల ఫాలభాగం నడుమ ఎర్రని తిలకం అలరారుతూంది... సన్యాసి కుడి చెయ్యెత్తి ఆశీర్వదించాడు.

సరే పద ! అన్నట్టు తల పంకించాడు.

ఇంట్లో అడుగు పెడ్తూనే సన్యాసి ముఖారవిందము గంభీరమైంది. ఎదురుగా వస్తున్న అనసూయమ్మనో నిమిషం తడిమాయతని చూపులు.

అతిథి అభ్యాగతుల్లో వెంకటయ్య కొత్త స్నేహితులు దామోదర్, పెంటయ్యలు.

"దయచేయండి స్వామీజీ !" అంటూ పాదాభివందనం చేశారు. మిగతావాళ్ళు గూడా అలాగే చేశారు.

సమయానికి విచ్చేసిన సన్యాసి సంతృప్తిగా భోంచెయ్యడం ఇంటిల్లిపాదినీ ఆనందపరిచింది. భోజనాలవగానే పట్టాలు పరిచిన వరండాలోకి చేరుకున్నారంతా.

భుక్తాయాసం, సీలింగు ఫ్యాను గాలి ఒంటిని చల్లగా స్పర్శిస్తూంది. ఎవరేమడిగినా సన్యాసి ఆఁ, ఊఁ, ఆహాఁ, ఊహుఁ అనో, అడ్డంగా లేదో నిలువుగానో తలూపుతూ సమాధానాలిస్తున్నాడు.

సన్యాసికి కుడిపక్కన కుటుంబసభ్యులు, ఎడమ పక్కన బంధుమిత్రులు వరుసల్లో కూర్చున్నారు. ఎదురుగా గోడకు అలంకరించబడున్న పొడుగాటి ఫోటోను పరకాయించి చూస్తున్నారంతా.

"ఫోటో మా నాన్న పరశురాములు గారిదే స్వామీజీ !" భక్తితో నమస్కరించింది వెంకటయ్య చెల్లి మైథిలి.

"ఔను, మా మామగారు చిరుద్యోగం చేస్తూ గూడా చిద్విలాసంగా మాట్లాడేవారట." మైథిలి భర్త మధుసూదన్ కనుబొమ్మ లెగరిపడినై. కదండీ ! అన్నట్టు అత్తగారి వైపు చూచాడు.

"అమ్మమ్మా ! ఫోటువలున్న తాతయ్య ఎప్పులొత్తాలే ?" మైథిలి మూడున్నరేళ్ళ కొడుకు పరశురాం అనసూయమ్మ మెడచుట్టూ చేతులు చుట్టేసి మొహంలో మొహం పెట్టాడు.

"మహానుభావుడు, సరస్వతి ఉన్నచోట లక్ష్మీదేవి ఉండదని తెలిసి కూడా కవిత్వం రాయడం మానలేదు." అంటూ మనవడి బుగ్గలు ముద్దాడింది అనసూయమ్మ.

"ఇంతకీ వారెలా స్వర్గస్తులయారండీ ?" దామోదరడిగాడు.

ముప్పై నెలల క్రితం వెంకటయ్యతో మూడుముళ్ళేయించుకున్న సుశీల సన్యాసి చూపుల్లోంచి తప్పించుకుని, ఆర్నెల్ల కూతురుకు పాలిస్తూ భర్తవైపు చూచింది - మామగారు అవతారమెలా చాలించారో తెలుసుకోవాలనే ఆసక్తితో.

"మా నాన్నగారెప్పుడూ శ్రమయే దైవమనేవారు." శూన్యంలోకి చూస్తున్న సన్యాసి నుద్దేశించి చెబుతున్నాడు వెంకటయ్య. "తన చిన్న జీతంతోనే మమ్మల్ని చదివించారు. కానీ... చెల్లికి పెళ్ళి సంబంధం, నాకు ఉద్యోగం వెతకడములో వేసారిపోయారు. పెళ్ళికి కట్నం, ఉద్యోగానికి లంచం అంటేనే ఆమడ దూరం పరుగెత్తేవారు. పెళ్ళీడుకొచ్చిన కూతురు గుండెల మీద కుంపటైతే, పైలాపచ్చీసు వయసుతో పనీపాటా లేకుండా తిరిగే కొడుకు గుండెకోత అనేవారు."

"కవిత్వం పేరు తెచ్చింది కాని కాసులు తేలేదు."

అనసూయమ్మ పెదాలు చప్పరించింది. భర్త తాలూకు జ్ఞాపకాలు ఆమె ఎదలో ఏదో చేస్తున్నై. కళ్ళను మంచుతెరలు కమ్ముకుంటున్నై. "కవిత్వమైనా మరే కళైనా ఆత్మానందం కోసమే గాని ఆర్థికపుష్టి కోసం కాదనేవారు."

"అద్సరే ! వారెలా చనిపోయారు ?" ఉపోద్ఘాతం బంగాళాఖాతమైపోతుందేమోనని భయమేసింది వెంటయ్యకు.

"ఈ నాటికి సరిగ్గా ఐదేళ్ళ క్రితం పిల్లల్ని ఇంట్లో ఉంచి మేమిద్దరమే బంధువులింట్లో పెళ్ళికి రైల్లో వెల్తున్నాం." మనవడిని కూతరుకప్పగించి కొంగుతో కళ్ళద్దుకుంది అనసూయమ్మ. "రాత్రి ఎనిమిదైంది. కాటుక కప్పబోసినట్టున్న అమావాస్య చీకటిని చీల్చుకుంటూ రైలు బ్రిడ్జి మీదుగా వెల్తూంది. మూడు పిడుగులొకేసారి పడ్డట్టు పెద్ద శబ్దమొచ్చింది. ఊగిసలాడ్తున్న రైలుకేమైందో అర్థంగాక అంగలార్చాం. ప్రాణాలరచేతిలో పట్టుకుని నేలరాలిన ముత్యాల్లా చెల్లా చెదరయ్యాం. ఎవరి ప్రాణం వాళ్ళకు తీపి గదా ! ఓ పెద్ద కుదుపుతో మేమంతా డబ్బాలో బతుకమ్మ పొట్ట నింపినట్టు కుప్పగా పడిపోయాం. మా ఆయన మాత్రం చాకచక్యంగా కిటికీలోంచి దూకేశారు. నేను స్పృహలో కొచ్చేసరికి ఒంటినిండా గాయాలతో ఆస్పత్రిలో ఉన్నాను. అప్పుడు తెలిసింది మా రైలు గూడ్స్‌కు గుద్దుకుందనీ, కొందరు చనిపోగా చాలామంది గాయపడ్డారనీను... అంతా విధి విలాసం...' ' మళ్ళీ కళ్ళద్దుకుంది.

"ఆ తర్వాత నెల రోజుల దాకా మా నాన్న జాడ తెలియలేదు. పోలీసుల విచారణలో చనిపోయారని తెలిసింది" మైథిలి ఫోటోవైపే చూస్తూ చెబుతోంది.

"గాయపడ్డవాళ్ల కైదువేలు, చనిపోయిన కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించింది. ఆ లక్ష రూపాయలతో నాపెళ్ళైంది. మా నాన్నగారి స్థానములో మా అన్నయ్యకు ఉద్యోగం దొరికింది. అమ్మకు ఫ్యామిలీ పెన్షనొస్తుంది."

అందరికంటే ఆసక్తిగా వింటూ తలూపుతున్నాడు సన్యాసి.

"మమ్మల్ని ప్రాణప్రదంగా పెంచిన మానాన్న తన ప్రాణాలర్పించి మాకో దారి చూపించి దేవుడైపోయాడు. చేతులెత్తి ఫోటోకు నమస్కరించాడు వెంకటయ్య.

"అందుకే నా కొడుక్కు మా మామగారి పేరు పెట్టుకున్నాం." మధుసూదన్ మందహాసం.

చిన్నారి పరశురాం - తల్లి ఒడిలో నిద్రిస్తున్న వెంకటయ్య కూతురు చెంపగిల్లి కిలకిలా నవ్వాడు. పాప కెవ్వుమంది.

"హోరి బడవనాకా ! ఎంత నీక్కాబోయే పెళ్ళామైనా ఇప్పుడే బుగ్గ గిల్లాలా ?" అనసూయమ్మ మనవడిని ముద్దాడింది.

జీరో బల్బు వెలుతురులా అందరి పెదాల మీద చిరునవ్వు మెరిసింది. అప్పుడు కన్పించినై సన్యాసి పెదాలు. కాని అతని అంతరంగము దేవదానవులు మథిస్తున్న క్షీరసాగరమైంది.

... ఈ రోజు నా పిండాకూడు నేనే తిన్నాను. సన్యసించినవాడు మళ్ళీ సంసార సాగర కెరటాలను గూడా తాకవద్దని గురువుగారు చెప్పింది నిజమే. భగవాన్ ! నా అజ్ఞానానికి సిగ్గుపడ్తున్నాను. నాకిప్పుడే జ్ఞానోదయమౌతూంది....

"శుభం ! ఇక నే వెల్తా నాయనా !" అంటూ లేచి పాదనమస్కారాల కాస్కారమివ్వకుండా అంగలేస్తూ గబగబా వెళ్ళిపోయాడు.

ఆ గొంతు... ఎప్పుడో విన్నట్టనిపించింది అనసూయమ్మకు. వివరాలడగాలనే ఆలోచన వచ్చేలోగా సన్యాసి కనుమరుగయ్యాడు.

**'ఢిల్లీ తెలుగు వాణి' మాసపత్రిక ... జూన్ - జులై , 1998**